# 70కి వచ్చి.. 165లో నిలిచి

## బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ బంపర్ హిట్

- స్టాక్ మార్కెట్ ఎంట్రీ అదుర్స్
- తొలిరోజు 136 శాతం ఎగిసిన షేర్
- ఎగబడి కొన్న మదుపరులు
- అప్పర్ సర్క్యూట్‌ను తాకిన స్టాక్స్
- రూ.1.37 లక్షల కోట్లకు మార్కెట్ విలువ



సోమవారం ముంబైలోని ఎన్ఎస్ఈలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్ సందర్భంగా బజాజ్ ఫైనాన్స్ ఎండీ రాజీవ్ జైన్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఎండీ అతుల్ జైన్, బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్‌లు.




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఐపీవో బిడ్డింగ్‌లో సంచలనం సృష్టించిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (బీహెచ్ఎఫ్ఎల్).. స్టాక్ మార్కెట్ల ఎంట్రీలోనూ రికార్డుల్ని నెలకొల్పింది. సోమవారం కంపెనీ షేర్ల కోసం మదుపరులు ఎగబడిపోయారు. దీంతో ఇష్యూ ధరపై 114.28 శాతం ఎగిసి లిస్టింగ్ జరిగింది. రూ.70 ధరతో వచ్చి రూ.150 వద్ద నమోదైంది. ఇన్వెస్టర్ల నుంచి ఈ ఆదరణ అలాగే కొనసాగడంతో అప్పర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో 135.70 శాతం పుంజుకొని 164.99 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లోనూ 135.71 శాతం ఎగబాకి రూ.165 వద్ద నిలిచింది.

### ఎం-క్యాప్ హై జంప్

దేశీయ స్టాక్ మార్కెట్లలో బ్రహ్మాండంగా లిస్టింగైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ మార్కెట్ విలువ భారీ ఎత్తున పెరిగింది. రూ.1,37,406.09 కోట్లకు చేరింది. కంపెనీ షేర్లకు మదుపరులు బ్రహ్మరథం పట్టడంతో విలువ ఇష్యూ ధరపై 136 శాతం పుంజుకున్నది. ఇక ఒక్కో షేర్ ధర రూ.66-70 శ్రేణితో రూ.6,560 కోట్ల ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు వచ్చిన కంపెనీ.. ఏకంగా 63.60 రెట్లు అధికంగా బిడ్లను అందుకున్న విషయం తెలిసిందే. వీటి విలువ రూ.3.23 లక్షల కోట్లపైనే కావడం గమనార్హం. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే ఓ పబ్లిక్ ఇష్యూకు ఈ స్థాయిలో బిడ్డింగ్ రావడం ఇదే తొలిసారైంది.

### ఆల్‌టైమ్ హైకి సెన్సెక్స్

బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ ఆల్‌టైమ్ హైలో ముగిసింది. సోమవారం 97.84 పాయింట్లు లేదా 0.12 శాతం పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 82,988.78 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలోనైతే 83,184.34 పాయింట్లను తాకింది. దీంతో నూతన ఇంట్రా-డే హై నమోదైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 27.25 పాయింట్లు లేదా 0.11 శాతం అందుకుని 25,383.75 వద్ద ఉన్నది. ఆల్‌టైమ్ హైకి కేవలం 5 పాయింట్ల దూరంలో ఆగింది. అయినప్పటికీ ఇంట్రా-డేలో గతంలో ఎప్పుడూ లేనట్టుగా 25,445.70 స్థాయిని తాకింది. రంగాలవారీగా చూస్తే.. యుటిలిటీస్, పవర్, మెటల్, క్యాపిటల్ గూడ్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు పెరిగాయి. ఎన్టీపీసీ షేర్ విలువ అత్యధికంగా 2.44 శాతం ఎగిసింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్ అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లూ పరుగులు పెట్టాయి. బజాజ్ ఫైనాన్స్ షేర్ విలువ మాత్రం 3 శాతానికిపైగా క్షీణించింది.

**టాప్-10 హౌసింగ్ ఫైనాన్స్‌ల్లో (రూ.కోట్లలో)**

| సంస్థ | మార్కెట్ విలువ |
|---|---|
| బజాజ్ హెచ్ఎఫ్ఎల్ | 1,37,406.09 |
| హడ్కో | 49,476.96 |
| ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ | 37,434.54 |
| పీఎన్‌బీ హెచ్ఎఫ్ఎల్ | 27,581.41 |
| ఆధార్ హెచ్ఎఫ్ఎల్ | 20,045.16 |
| ఆప్టస్ వాల్యూ | 16,598.17 |
| ఆవాస్ ఫైనాన్షియర్స్ | 14,278.33 |
| కెన్ ఫిన్ హోమ్స్ | 11,983.87 |
| సమ్మాన్ క్యాపిటల్ | 11,773.23 |
| హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ | 10,602.99 |

# నిజాలేంటో చెప్తున్నారుగా..

**సెబీ చీఫ్ వ్యవహారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్ దంపతుల వ్యవహారంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తొలిసారి స్పందించారు. మాధబి పురి బచ్, ఆమె భర్త ధవల్ బచ్ తమను తాము రక్షించుకొంటూనే, తమపై వచ్చిన ఆరోపణలకు ధీటుగా స్పందిస్తున్నారన్నారు. సోమవారం న్యూస్18 ఇండియా కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'చాలా ఆరోపణలకు సమాధానాలు వస్తున్నాయ్. ఈ నిజాలను పరిగణనలోకి తీసుకుంటారనే అనుకుంటున్నాను' అని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌నుద్దేశించి పరోక్షంగా మంత్రి వ్యాఖ్యానించారు. దీంతో ఈ అంశంలో మాధబి పురి బచ్ సమాధానాలపట్ల మీరు సంతృప్తికరంగా ఉన్నారా? అన్న ప్రశ్నకు 'నేనిక్కడ ఉన్నది దాన్ని నిర్ధారించేందుకు కాదు' అని నిర్మలా సీతారామన్ బదులిచ్చారు. బచ్ దంపతులు అక్రమాలకు పాల్పడ్డారని, లాభాపేక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలు వస్తున్న సంగతి విదితమే. అదానీ వ్యవహారంలో బచ్ అవినీతికి దిగారని హిండెన్‌బర్గ్ ఆరోపించినదీ తెలిసిందే.

**రేపట్నుంచి ఎన్‌పీఎస్ వాత్సల్య**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) వాత్సల్య పథకాన్ని బుధవారం నిర్మలా సీతారామన్ ప్రారంభించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను జూలైలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎన్‌పీఎస్ వాత్సల్య స్కీంను ప్రకటించిన విషయం తెలిసిందే.

## బీఎండబ్ల్యూ రిటైల్.నెక్స్ట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: అన్ని వాహనాలను ఒకేచోట కొనుగోలుదారులకు అందించే ఉద్దేశంలో భాగంగా జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ..నూతనంగా రిటైల్.నెక్ట్స్ పేరుతో సరికొత్త సేవలకు శ్రీకారం చుట్టింది. ఈ సేవల్లో భాగంగా బీఎండబ్ల్యూ, మినీ, బీఎండబ్ల్యూ మోటరాడ్ మాడళ్లు ఒకే షోరూంలో లభించనున్నాయి. ఈ నూతన సేవలకోసం వచ్చే మూడేండ్లకాలంలో బీఎండబ్ల్యూతో పాటు డీలర్లు రూ.365.6 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, సీఈవో విక్రమ్ పవాహ్ తెలిపారు.

# అటకెక్కిన ఏరోస్పేస్ వర్సిటీ!

**బీఆర్ఎస్ హయాంలో కసరత్తు • ప్రభుత్వం మారాక మూలనపడ్డ ప్రతిపాదన**

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏరోస్పేస్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన అటకెక్కినట్లే కనిపిస్తున్నది. తెలంగాణను ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలు దేశ, విదేశీ దిగ్గజ కంపెనీల భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు ప్రకటించారు. అంతేకాదు, రాష్ట్రంలో అనేక అంతర్జాతీయ సంస్థల ఏర్పాటు ద్వారా ఏరోస్పేస్ రంగ అభివృద్ధికి అవసరమైన పర్యావరణ వ్యవస్థను కూడా నెలకొల్పింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ కీలక ప్రతిపాదనను కాంగ్రెస్ సర్కార్ మూలనపడేసింది. దీనిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించడానికి నిరాకరిస్తున్నారు. నిజానికి గత ప్రభుత్వ కృషితో అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్, టాటా గ్రూపు సంయుక్తంగా తయారీ కేంద్రాన్ని నెలకొల్పాయి. ఇక్కడ తయారవుతున్న హెలీకాప్టర్ క్యాబిన్‌లు సహా ఇతర విడిభాగాలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అలాగే బోయింగ్, జీఈ, ప్రాట్ అండ్ విట్నీ, శాఫ్రాన్, జీఎమ్మార్ తదితర కంపెనీలు హైదరాబాద్‌లో తయారీ కేంద్రాలతోపాటు ఎంఆర్‌వో(మెయింటనెన్స్, రిపేర్ అండ్ ఒవరాల్)లను ఏర్పాటు చేశాయి. వీటికి అనుబంధంగా వెయ్యికి పైగా చిన్న సంస్థలు వెలిశాయి.

**ఆదిబట్లలోనే అంకురార్పణ**

దేశంలోనే మొట్టమొదటి ఏరోస్పేస్ క్లస్టర్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు సమీపంలోని ఆదిబట్లలో ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే ఏరోస్పేస్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత ఏడాది కేటీఆర్ అమెరికా పర్యటన సందర్భంగా పలు ఏరోస్పేస్ కంపెనీలు రాష్ట్రంలో తమ పెట్టుబడులను విస్తరించడంతోపాటు వర్శిటీ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ ప్రతిపాదన ముందుకు సాగకపోవడంతో ఆ సంస్థలు కూడా వెనుకంజ వేసినట్లు తెలుస్తున్నది. ఈ యూనివర్శిటీ ఏర్పాటువల్ల ఇక్కడే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా ఏరోస్పేస్ రంగం విస్తరించే అవకాశముంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

## హెచ్‌సీఎల్ టెక్నాలజీ నం.1

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీ మరోసారి తన సత్తాను చాటింది. దేశవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ కంపెనీల్లో హెచ్‌సీఎల్ తొలి స్థానంలో నిలిచిందని టైమ్ మ్యాగజైన్ విడుదల చేసిన 'ప్రపంచ అత్యుత్తమ కంపెనీలు 2024' జాబితాలో వెల్లడించింది. నోయిడా కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న ఈ సంస్థ వృత్తిపరమైన సేవలు అందించే అంతర్జాతీయ టాప్-10 జాబితాలో కూడా చోటు దక్కించుకోవడం విశేషం. అంతర్జాతీయంగా కంపెనీల పనితీరు, ఉద్యోగుల సంతృప్తి, ఆదాయ వృద్ధి, స్థిరత్వం ఆధారంగా టైమ్స్ ఈ నివేదికను రూపొందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ రూ.28 వేల కోట్ల ఆదాయంపై రూ.4,257 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. ప్రస్తుతం సంస్థలో 2.19 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

# మహీంద్రా తేలికపాటి వాణిజ్య వాహనాలు

**'వీరో' ఎల్‌సీవీ పరిచయం.. ప్రారంభ ధర రూ.7.99 లక్షలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా లైట్ కమర్షియల్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. 2-3.5 టన్నుల లోపు సామర్థ్యం కలిగిన 'వీరో' లైట్ కమర్షియల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాహనాలు రూ.7.99 లక్షల నుంచి రూ.9.56 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నాయి. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా మహీంద్రా అండ్ మహీంద్రా ప్రెసిడెంట్ ఆటోమోటివ్ డివిజన్ విజయ్ నక్రా మాట్లాడుతూ..దేశంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న ఎల్‌సీవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి ఈ కొత్త వెర్షన్ మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇందుకోసం రూ.900 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. డీజిల్, సీఎన్‌జీ ఇంజిన్‌తో తయారైన ఈ వాహనాలతో పాటు భవిష్యత్తులో ఈవీని కూడా విడుదల చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రెండు రకాల్లో లభించనున్న ఈ మాడల్ లీటర్ డీజిల్‌కు 18.4 కిలోమీటర్లు, కిలో సీఎన్‌జీకి 19.2 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఈ ఎల్‌సీవీలో ఎయిర్‌బ్యాగ్ ఆప్షన్ కూడా ఉన్నదని, ఇందుకోసం రూ.15 వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్, రివర్స్ పార్కింగ్ కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.




## హోండా బైకుల రీకాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: హోండా మోటార్‌సైకిల్ పలు బైకులను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. వీల్ స్పీడ్ సెన్సార్, క్యామ్‌షాఫ్ట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సీబీ300ఎఫ్, సీబీ300ఆర్, సీబీ350, హెచ్‌నెస్ సీబీ 350, సీబీ350 ఆర్ఎస్ వెనక్కిపిలిపిస్తున్నట్లు తెలిపింది. అక్టోబర్ 2020 నుంచి ఏప్రిల్ 2024 లోపు తయారైన ఈ మాడళ్లను రీకాల్ చేస్తున్నట్లు వెల్లడించింది.

## బెనెల్లీ బైకులపై రాయితీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16: వచ్చే పండుగ సీజన్‌లో బెనెల్లీ, జోంటస్ సూపర్ బైకులను కొనుగోలు చేసినవారికి రూ.30 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. జోంటస్ 350 సీసీ బైకులను కొనుగోలు చేసిన వారికి రూ.20 వేల విలువైన రెండేండ్ల పాటు సర్వీస్ వ్యారంటీ, బెనెల్లీ బైకులపై రూ.30 వేల రెండేండ్ల పాటు సర్వీసు ప్రయోజనాలు కల్పించనున్నది.

# జినోమ్ వ్యాలీలో లారస్ పరిశోధన కేంద్రం

**రూ.250 కోట్లతో ఏర్పాటు చేసిన సంస్థ**

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ లారస్ ల్యాబ్స్ లిమిటెడ్.. జినోమ్ వ్యాలీలో నూతన పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని(ఆర్ అండ్ డీ) ప్రారంభించింది. షామిర్‌పేట్‌లోని ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌లో రూ.250 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌తో 800 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లారస్ ల్యాబ్స్ ఫౌండర్, సీఈవో సత్యనారాయణ చావా మాట్లాడుతూ..ఈ నూతన ఆర్‌అండ్‌డీ సెంటర్‌ను కలుపుకొని మొత్తంగా ఐదు పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అయిందని, ఈ సెంటర్‌తో మరిన్ని ఔషధాలపై దృష్టి సారించడానికి వీలు పడనున్నదన్నారు. వచ్చే నాలుగేండ్లలో రూ.2,500 కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నారు.

**3జీవీ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం**

3జీవీ జినోమ్ వ్యాలీలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌సీ-ఎడ్జ్ అడ్వాన్స్‌డ్ సర్టిఫైడ్ సైన్సెస్ సెంటర్‌ను శ్రీధర్ బాబు ప్రారంభించారు. 1.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ కోసం సంస్థ రూ.105 కోట్ల నిధులు వెచ్చించింది.


